సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

ఎన్నాళ్లీ అవమానాలు..!

పెద్ద వలంటీర్ల అవతారం..!

- సచివాలయ ఉద్యోగులకు వేధింపులు
- జియో ట్యాగింగ్ సర్వే చేయాలని ప్రభుత్వం నుంచి తీవ్ర ఒత్తిడి
- బయోమెట్రిక్ హాజరుతో మెడపై కత్తి
- వేతనాల్లో కోత పెట్టాలని తాజాగా ఆదేశాలు
- ఇళ్లకు వచ్చి ఫొటోలు తీస్తుండడంపై ప్రజానీకం నుంచి వ్యతిరేకత


జీవీఎంసీ 57వ వార్డులోని సచివాలయం



జియో ట్యాగింగ్ కోసం రూపొందించిన యాప్

విశాఖ విద్య : 'ఇంటికొచ్చి ఫొటో ఎందుకు తీస్తున్నారు..? ఆ అధికారం మీకెవరు ఇచ్చారు..? ఏపీ ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు చూపించండి. ఏం వేళాకోలంగా ఉందా..? ఫొటో లేదూ... గిటో లేదు వెళ్లండి' అంటూ జియోట్యాగింగ్ సర్వే కోసమని ఇళ్లకు వెళ్తున్న సచివాలయ ఉద్యోగులకు ప్రజానీకం నుంచి ఎదురౌతున్న సమాధానం ఇదీ. 'ఆ... సచివాలయ ఉద్యోగులా... మాకేం సర్వే అక్కర్లేదు' అంటూ అపార్టుమెంట్ల వాసులు నుంచి పరాభవం ఎదురవుతోంది. మొత్తంగా కూటమి ప్రభుత్వం తీరుతో సచివాలయ ఉద్యోగులు ప్రస్తుతం తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగులమైన మాకు ఎన్నాళ్లీ అవమానాలంటూ సచివాలయ ఉద్యోగులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్ర స్థాయి విధుల్లో ఎదురవుతున్న ఇబ్బందులు వినే వారు లేక లోలోన రగిలిపోతున్నారు. టార్గెట్ల పేరుతో ఉన్నతాధికారుల నుంచి సైతం వేధింపులు ఎక్కువవుతుండడంతో తామెందుకీ ఉద్యోగానికి వచ్చామా అని దిగులు చెందుతున్నారు. తామంతా సచివాలయ ఉద్యోగాలను వదిలిపెట్టి పోవాలనేదే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యంలా కనిపిస్తోందని కొంత మంది బాహాటంగానే అంటున్నారు.

జియో ట్యాగింగ్ కోసం తీవ్ర ఒత్తిడి

గోపాలపట్నం మండలంలో 60 సచివాలయాలు ఉన్నాయి. వీటిలో పనిచేస్తున్న ఉద్యోగులంతా ప్రస్తుతం జియో ట్యాగింగ్ సర్వేలో నిమగ్నమయ్యారు. 'ఎంప్లాయిస్ మొబైల్ అప్లికేషన్' పేరిట రూపొందించిన యాప్‌లో ప్రతీ ఇంటినీ ఫొటో తీసి, జియో ట్యాగింగ్ చేసేలా ఆయా సచివాలయాల పరిధిలోని గృహాల సంఖ్యకు అనుగుణంగా టార్గెట్లు పెట్టారు. సర్వే సమయంలో గృహ యజమాని తప్పనిసరిగా బయోమెట్రిక్ లేదా ఫేసియల్ అంథెంటికేషన్ ఇవ్వాలి. దీనిపై ప్రజానీకం నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నియోజకవర్గంలోని మాస్ కాలనీల్లో కొంతమేర సెక్సెస్ అవుతున్నా, అపార్ట్‌మెంట్లు, వుడా కాలనీల్లోని ప్రజానీకం జియో ట్యాగింగ్‌కు అంగీకరించడం లేదు. జిల్లా అధికారులు ఇవేమీ పట్టించుకోకపోగా, సాయంత్రానికి ఎన్ని ఇళ్లు చేశారని సమీక్షలు చేస్తూ సచివాలయ ఉద్యోగులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఉద్యోగులా..? పెద్ద వలంటీర్లా..?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ ఉద్యోగులపై మరింత పనిభారం పెరిగింది. ఇటీవల వంద రోజుల పాలన పూర్తయిన సందర్భంగా 'మా మంచి ప్రభుత్వం' అంటూ ముద్రించిన స్టిక్కర్లను సచివాలయ ఉద్యోగులే ఇళ్లకు వెళ్లి అంటించారంటే వారి దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ అర్హతతో జిల్లా స్థాయిలో నిర్వహించిన పరీక్షల్లో మెరిట్ సాధించి ఉద్యోగాల్లో చేరిన తమను కూటమి ప్రభుత్వం పెద్ద వలంటీర్లు మాదిరిగా వినియోగించుకుంటోందని సచివాలయ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాల్లో కత్తెర వేయడమే ప్రభుత్వ లక్ష్యమా..?

తీవ్రమైన పని ఒత్తిడితో సతమతమవుతున్న సచివాలయ ఉద్యోగులకు ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వులు మరింత ఆందోళనకు గురి చేస్తున్నాయి. 22 – 10 – 2024 నుంచి 21 – 11 – 2024 వరకు నమోదైన బయోమెట్రిక్ హాజరును పరిగణనలోకి తీసుకుని సచివాలయ ఉద్యోగులకు నవంబర్ వేతనాలు చెల్లించాలని ప్రభుత్వం గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. క్షేత్రస్థాయి పర్యటనలు, సర్వర్ ఇబ్బందులతో సవ్యంగా బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకోలేని సచివాలయ ఉద్యోగులకు ఈ నెల జీతంలో కోత పడనుంది. డిసెంబర్ 1న అందుకోబోయే వేతనం ఎంత వస్తుందోనని ఇప్పటి నుంచే ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులమే అయినప్పటికీ, మాపైనే ఎందుకీ కక్షపూరిత చర్యలు అంటూ సచివాలయ సిబ్బంది తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

108 సిబ్బంది సమ్మె నోటీస్


సమ్మె నోటీసు అందజేస్తున్న 108 సిబ్బంది

విశాఖ విద్య : సమస్యల పరిష్కారం కోసం 108 సిబ్బంది సమ్మె బాట పడుతున్నారు. ఈ నెల 25 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఎన్ఏడీ ప్రాంత సిబ్బంది అంతా కలిసి గురువారం గోపాలపట్నం తహసీల్దార్ చావలి వెంకట రమేష్‌కు సమ్మె నోటీసు అందజేశారు. అదనపు పనిభారంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సర్వీసు పరమైన సమస్యలన్నీ అపరిష్కృతంగానే ఉన్నాయని పేర్కొన్నారు. 108 సర్వీసులను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెలో కొనసాగుతామని సిబ్బంది వెల్లడించారు.

వైభవునికి పంచామృతాభిషేకం నేడు

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉదయం ఆర్జిత సేవలో పాల్గొనే దాతలు, భక్తులు మంగళధ్వని, వేద మంత్రోచ్చరణ మధ్య అభిషేక ప్రదక్షిణ చేస్తారని తెలిపారు. అనంతరం స్వామికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో పంచామృతాభిషేకం చేస్తారని తెలిపారు.

క్లుప్తంగా

వేడుకగా గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు


గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న మళ్ల విజయప్రసాద్, తదితరులు

విశాఖ విద్య: ఎన్ఏడీ కొత్తరోడ్‌లో గౌరీ సంఘం ఆధ్వర్యంలో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. గురువారం రాత్రి బతుకమ్మ జానపద కళా రూపాలను ప్రదర్శించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బతుకమ్మ పాటలు పాడారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మళ్ల విజయప్రసాద్ ఉత్సవాల్లో పాల్గొని గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల నిర్వాహక కమిటీ పెద్దలు విజయ ప్రసాద్‌ను శాలువాతో సత్కరించారు. స్వామి వారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దొడ్డి సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న బాబా

విశాఖ విద్య : జీవీఎంసీ 90వ వార్డు ఏపీఎస్ఈబీ కాలనీ శ్రీ షిర్డీ సాయి ధ్యాన మందిరంలో బాబాకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం పంచామృతాలతో అభిషేకం జరిపించారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. బాబా వారిని దర్శించుకున్న భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు చేశారు. సాయంత్రం బాబాకి ప్రత్యేక హారతులు ఇచ్చారు. సాయి సంకీర్తనలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం పల్లకీ సేవ వైభవోపేతంగా జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు విల్లా సత్యనారాయణరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

యువకుడి ఆత్మహత్య

విశాఖ విద్య: గోపాలపట్నం మండలం చంద్రానగర్‌లో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బిహార్ రాష్ట్రం సహర్ష జిల్లా శాసల్ ప్రాంతానికి చెందిన శింభు సదా (35) పాట్నా వెళ్లే రైలులో ముఠా కార్మికులతో కలిసి రాజమండ్రి వెళ్తున్నాడు. అయితే బుధవారం రాత్రి సింహాచలం రైల్వే స్టేషన్‌లో దిగి, చంద్రానగర్ వరకు వచ్చి, అక్కడ నిర్మాణంలో ఉన్న ఓ భవనం పిల్లర్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఉదయం చూసిన స్థానికులు గోపాలపట్నం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీఐ సురేష్ ఆధ్వర్యంలో ఎస్ఐ అప్పలనాయుడు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావుతో కార్మిక సంఘాల ప్రతినిధులు

సింధియా : షిప్‌యార్డ్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు షిప్‌యార్డ్ బీఎంఎస్, టీఎన్‌టీయూసీ ప్రతినిధులు గురువారం వినతిపత్రం అందించారు. హిందుస్తాన్ షిప్‌యార్డ్‌కు విజ్చేసిన జీవీఎల్‌ను కార్మిక సంఘాల నాయకులు కలిసి తమ సమస్యలు చెప్పుకున్నారు. ఎల్ అండ్ ఎం సిరీస్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయించేందుకు కృషి చేయాలని కోరారు. సింహాచలం, సుధాకర్, మురళీ, రాయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమంలో అతిథులు, విద్యార్థులు


నెహ్రూ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మల్కాపురం : గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని, విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణానికి అంతా కృషి చేయాలని ములగాడ మండల విద్యాశాఖాధికారి త్రినాథ్ సూచించారు. మల్కాపురం శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞానాన్ని, సృజనాత్మక శక్తిని పెంచుతాయన్నారు. రచయిత సుంకర చలపతిరావు, న్యాయవాది జి.కె.వి.రాజు, జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి అజేయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆలపించిన దేశభక్తి గీతాలు అలరించాయి.

విశాఖ విద్య : గోపాలపట్నం శాఖ గ్రంథాలయంలో వారోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలుత భారతదేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాల ఉపయోగాన్ని నేటి తరానికి తెలియజేసేందుకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు లైబ్రేరియన్ నరసింహం తెలిపారు. గ్రంథాలయాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సింధియా : జీవీఎంసీ 40వ వార్డు పరిధి షిప్‌యార్డు కాలనీలో గల పౌరగ్రంథాలయంలో వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. జీవీఎంసీ 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు పాల్గొని వేడుకలను ప్రారంభించారు. అనంతరం బాలల దినోత్సవం, నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేటి బాలలే బావి భారత పౌరులని, నవసమాజ నిర్మాణంలో వారిని భాగస్వాములను చేయాలని సూచించారు. చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు భీశెట్టి గణేష్, శ్యామూల్, మీసాల సత్యనారాయణ, నరసింహమూర్తి, గణేష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సిబ్బందికి దుస్తుల పంపిణీ


పారిశుధ్య సిబ్బందికి దుస్తులు అందిస్తున్న 62వ వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావు

సింధియా : ఇటీవల విజయవాడలో వరద ప్రభావానికి గురైన ప్రాంతాల్లో విశేష సేవలందించిన జీవీఎంసీ పారిశుధ్య సిబ్బందికి 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు గురువారం నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు పారిశుధ్య సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు భీశెట్టి గణేష్, సచివాలయ శానిటరీ సెక్రటరీ జి.శ్రీనివాసరావు, ఆశాభీ, శానిటరీ మేస్త్రీ ధనాల వెంకటరమణ, ఇతర పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

- పారిశుధ్య సిబ్బందికి 63వ వార్డు కార్పొరేటర్ గల్లా చిన్న దుస్తులు అందజేశారు. నాయకులు గూడెల కృష్ణ, ధర్మ, రాకీ, నారాయణరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

సీతమ్మధార : ద్విచక్ర వాహనం వెనుక వైపు కూర్చున్న వృద్ధురాలు ప్రమాదవశాత్తూ రోడ్డుపై పడిపోవడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ద్వారకా జోన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విజయనగరం జిల్లాకు చెందిన కమలా మారమ్మ (60) అనారోగ్యం కారణంగా చికిత్స నిమిత్తం విశాఖ నగరంలోని కుమారుడి ఇంటికి వెళ్లేందుకు మద్దిలపాలెంలో బస్సు దిగారు. అక్కడి నుంచి సీతమ్మధార హిల్ వ్యూ ప్రాంతంలో గల ఇంటికి వెళ్లేందుకు కుమారుడి ద్విచక్ర వాహనం ఎక్కారు. మార్గ మధ్యలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సమీపంలో ప్రమాదవశత్తూ రోడ్డుపై మారమ్మ పడిపోయారు. దీంతో ఆమె తలకు బలమైన గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మరణించారు. ద్వారకా స్టేషన్ ఏఎస్ఐ ప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో విద్య, ఉద్యోగావకాశాలు


విజేతలకు మెరిట్ సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ కరణంరెడ్డి, నాయకులు

ఉక్కునగరం: క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయని కిక్ బాక్సింగ్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కరణంరెడ్డి నర్సింగరావు అన్నారు. ఈ నెల 5 నుంచి 11 వరకు జరిగిన జాతీయ కుడో పోటీల్లో హరికృష్ణ ఫిట్‌నెస్ జోన్ నుంచి వివిధ కేటగిరీల్లో పాల్గొన్న 28 మంది క్రీడాకారులు బంగారు, రజత పతకాలు గెలుపొందారు. ఈ సందర్భంగా గురువారం ఉక్కునగరంలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విజేతలకు ముఖ్య అతిథి కరణంరెడ్డి మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాకు చెందిన క్రీడాకారులు ఎక్కువ పతకాలు గెలుపొందడం అభినందనీయమన్నారు. క్రీడా కోటాల్లో మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. రాష్ట్ర కుడో సంఘం అధ్యక్షుడు ఎ.శశిధర్ మాట్లాడుతూ భారత క్రీడా సంస్థ, రాష్ట్ర క్రీడల సంస్థ గుర్తింపు పొందిన ఏకైక క్రీడా సంస్థ కుడో అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కుడో డైరెక్టర్ అనురాధ, ప్రధాన కార్యదర్శి రవి బాబు, శివకాశీరావు, కోటిరెడ్డి, నాగ యశ్వంత్, రమణ, పేర్ల అప్పారావు, కార్మిక నాయకులు రామ్మోహన్‌కుమార్, బి.సత్యనారాయణ, నాగేశ్వరరావు, బి.దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు అధికారి భార్యకు వేధింపులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారి భార్యను వేధిస్తున్న కేసులో ఉక్కునగరానికి చెందిన వ్యక్తిని స్టీల్‌ప్లాంట్ పోలీసులు అరెస్టు చేశారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–10లో నివసిస్తున్న అధికారి భార్యను అదే సెక్టార్‌లో నివసిస్తున్న కుమార్ అనే వ్యక్తి కొంతకాలంగా వేధిస్తున్నాడు. తమ పిల్లల కోసం పాఠశాలకు వెళ్తున్నప్పుడు ఆమెను వెంటాడుతున్నాడు. బుధవారం ఉదయం ఆమె ఇంటికి వెళ్లి వేధించడంతో ఆమె గురువారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ తాతారావు నిందితుడు కుమార్‌ను అరెస్టు చేసి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కూటమి పాలనలో ప్రజలపై ధరల భారం


గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు


తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మల్కాపురం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాలుగు నెలల్లోనే ప్రజలపై ధరల భారం మోపిందని సీపీఎం మల్కాపురం జోన్ నాయకులు ఆర్.లక్ష్మణమూర్తి ఆరోపించారు. పెరిగిన నిత్యావసర సరకుల ధరలు, విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ 59వ వార్డు ములగాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాపోరు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ అతని కంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్న చందంగా కూటమి ప్రభుత్వ తీరు ఉందన్నారు. ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో గడిచిన నాలుగు నెలల్లో నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. అదేరీతిలో విద్యుత్ చార్జీలు భారీగా పెంచి నమ్మి ఓట్లు వేసిన ప్రజలను కూటమి నాయకులు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు చెప్పిన మాటలకు... గెలిచిన తర్వాత అమలు చేస్తున్న విధానాలకు పొంతన లేదన్నారు. ఉచిత ఇసుక హామీని మరిచారని, ఉచిత గ్యాస్ అములు కావడం లేదని, మహిళలకు ఉచిత బస్సు సర్వీస్ ఊసే లేదని, నిరుద్యోగులకు ఉపాధి అసలే లేదన్నారు. అన్ని వర్గాల వారినీ పాలకులు మోసం చేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ తీరు మార్చుకోవాలని, లేకుంటే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అనంతరం ధరలు తగ్గించాలని కోరుతూ తహసీల్దార్ భుజంగరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పెంటారావు, పైడిరాజు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం ధర్నా

విశాఖ విద్య : నిత్యావసర సరకుల ధరలు నియంత్రించాలని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం గోపాలపట్నం మండల కమిటీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు గురువారం ధర్నా నిర్వహించారు. పెంచిన ధరలు తగ్గించాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యురాలు బి.పద్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు చెప్పిన మాటలకు, ఇప్పుడు అమలు చేస్తున్న విధానాలకు ఎంతో తేడా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ చార్జీల భారం మోపడంతో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. రోజురోజుకూ నిత్యావసర సరకుల ధరలు పెరుగుతున్నా అదుపు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటరావు, ఈశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్లలో టెన్షన్..!

- అలంకారప్రాయంగా సిగ్నల్ లైట్లు
- నిత్యం వాహనాలతో రద్దీగా బీఆర్‌టీఎస్
- ప్రమాదాలు జరుగుతున్నా చోద్యం చూస్తున్న అధికారులు


కంచరపాలెం కూడలికి వెళ్లే సబ్ వే రహదారిలో సాయంత్రం సమయంలో ట్రాఫిక్ పరిస్థితి ఇదీ


బీఆర్‌టీఎస్‌లో పనిచేయని సిగ్నల్ లైట్లు


బీఆర్‌టీఎస్‌లో ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్స్

కంచరపాలెం : ప్రజాధనంతో, ప్రజల భద్రత కోసం ఏర్పాటు చేసిన ట్రాఫిక్ నియంత్రణ సిగ్నల్ లైట్లు అలంకారప్రాయంగా మారడంతో కీలక జంక్షన్లలో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. ఫలితంగా వాహనదారులు, పాదచారులు కూడళ్ల వద్ద తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారుల నుంచి లక్షలాది రూపాయలు అపరాధ రుసుము పేరుతో వసూలు చేస్తున్నప్పటికీ వారి భద్రత కోసం కనీస చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం కంచరపాలెం కూడలి నుంచి మర్రిపాలెంకు వెళ్లే బీఆర్‌టీఎస్ మార్గంలో ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు పనిచేయడం లేదు. వాటిని ఇప్పటి వరకు వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అలంకారప్రాయంగా ఉన్నాయి. గతంలో కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, 104 ఏరియా, మర్రిపాలెం, కరాసా ప్రాంతాల్లో సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేశారు. అనంతరం అవి పనిచేయకున్నా... మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురాకుండా వదిలేశారు. పలుమార్లు ట్రాఫిక్ విభాగ అధికారులకు విన్నవించినప్పటికీ చర్యలు తీసుకోవడం లేదని పలువురు వాహనదారులు ఆరోపిస్తున్నారు.

ట్రాఫిక్ రద్దీ విపరీతం

కంచరపాలెం నేతాజీ ఫ్లై ఓవర్ వంతెన కూడలి, ఊర్వశి కూడలి జాతీయ రహదారికి వెళ్లే కూడలి మార్గం, ఐటీఐ జంక్షన్, 104 ఏరియా నుంచి నేవల్, రైల్వే ప్రాంతాలకు వెళ్లే కూడలి (జ్ఞానాపురం రైల్వే స్టేషన్ కూడలి, చావులమదుం, కాన్వెంటు కూడలి నుంచి గాజువాకకు వెళ్లే రహదారి) ప్రాంతాల్లో రోజురోజుకీ ట్రాఫిక్ పెరిగిపోతోంది. మూడు, నాలుగు వైపుల నుంచి వాహనదారులు వేగంగా వస్తుండడం... ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉదయం, సాయంత్రం సమయంలో రద్దీ ఎక్కువగా ఉండడంతో వాహనాలు నియంత్రించేందుకు ట్రాఫిక్ పోలీసులు అవస్థలు పడుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొద్ది రోజుల కిందట ఊర్వశి కూడలి ప్రాంతంలో ఓ ఆటో నిలిపేయడంతో... ట్రాఫిక్‌కు భారీ అంతరాయం కలిగింది. దీంతో అటుగా వెళ్లే అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుంది. తక్షణమే అధికారులు స్పందించి సిగ్నల్ లైట్లు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కూడళ్లలో ఎన్నో ప్రమాదాలు

ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేసినప్పటికీ వినియోగంలోకి తీసుకురాకపోవడంతో పలు కూడళ్లలో ఇప్పటి వరకూ సుమారు 60 ప్రమాదాలు సంభవించాయి. నిత్యం ఏదో ఒక జంక్షన్‌లో ప్రమాదం సంభవిస్తూనే ఉందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. సిగ్నల్ లైట్లు ఉన్నప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. వాటిని వినియోగంలోకి తీసుకొస్తే ప్రమాదాలు నియంత్రించేందుకు అవకాశం ఉండేదంటున్నారు.

ఆర్టీసీ ఈడీకి చైర్మన్ కొనకళ్ల పరామర్శ


బ్రహ్మానందరెడ్డిని పరామర్శిస్తున్న కొనకళ్ల నారాయణరావు, ఇతర అధికారులు

సీతమ్మధార : ప్రమాదానికి గురై ఎస్ఆర్ఐ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆర్టీసీ జోన్–1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేఎస్ బ్రహ్మానందరెడ్డిని గురువారం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పలువురు అధికారులు పరామర్శించారు. త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆస్పత్రి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆర్టీసీ చైర్మన్ వెంట జోన్–1 ఇన్‌చార్జ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయకుమార్, విశాఖ జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు, విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఐవీవీపీ దుర్గాప్రసాద్ ఇతర అధికారులు ఉన్నారు. బ్రహ్మానందరెడ్డికి అందిస్తున్న చికిత్సను ఆర్టీసీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ వాణి నీలిమ, కిమ్స్ వైద్యాధికారి డాక్టర్ విజయ పర్యవేక్షిస్తున్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ వెస్ట్
8978872250

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ వెస్ట్
9912222753, 9705933394
Office mail : sakshiadvtvsp@gmail.com